AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
10-1-2026 (saturday) MAIN EDITION

## వీసా ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజులు పెంచిన అమెరికా




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** వీసాల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజులను అమెరికా పెంచింది. ప్రస్తుతం 2,805 డాలర్లు ఉండగా.. 2,965 డాలర్లకు పెంచింది. మార్చి 1 నుంచి ఈ పెంపు అమల్లోకి రానుంది. ఈమేరకు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ ఓ ప్రకటనను విడుదల చేసింది. జూన్ 2023 నుంచి జూన్ 2025 మధ్య ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ ఫీజు పెంచినట్లు వెల్లడించింది. హెచ్ 1బీ, ఎల్ 1, ఒ 1, పీ 1, టీఎన్ వీసాల విషయంలో ప్రీమి యం ఫీజు 2,805 డాలర్ల నుంచి 2,965కు పెరగనుంది. ఎఫ్ 1, జే 1 వంటి వీసాలకు సంబంధించిన ఫీజు 1,965 నుంచి 2,075 డాలర్లకు పెంచింది.

## 'రాజాసాబ్' తొలిరోజు కలెక్షన్లు రూ.112 కోట్లు




**అక్షరటుడే, సినిమా డెస్క్ :** ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన ది రాజాసాబ్ మూవీ ప్రపంచవ్యాప్తంగా శుక్రవారం విడుదలైంది. ఈ మూవీ తొలిరోజు రూ.112 కోట్ల కలెక్షన్లు సాధించింది. ఈ మేరకు చిత్రబృందం శనివారం సక్సెస్ మీట్ ఏర్పాటు చేసింది. డైరెక్టర్ మారుతి, హీరోయిన్లు నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధికుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నిర్మాత విశ్వప్రసాద్ మాట్లాడుతూ శుక్రవారం రూ.112 కోట్లు వచ్చినట్లు వెల్లడించారు. తమ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో బృందం



**అక్షరటుడే, తిరుమల:** తిరుమల శ్రీవారిని ఇస్రో బృందం దర్శించుకుంది. శనివారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఇస్రో ఛైర్మన్ నారాయణన్, ఆయన బృందం స్వామివారి సేవలో పాల్గొన్నారు. పీఎస్ఎల్‌వీ-సీ62 రాకెట్ నమూనాను శ్రీవారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కూలిన చార్టర్డ్ ఫ్లైట్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఒడిశాలో చార్టర్డ్ ఫ్లైట్ కూలిపోయింది. రూర్కెలాలోని రఘునాథ్‌పల్లి ప్రాంతంలో క్రాష్ ల్యాండింగ్ అయింది. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. రూర్కెలా నుంచి భువనేశ్వర్ వెళ్తుండగా.. టేకాఫ్ అయిన 10 నిమిషాలకే విమానం ప్రమాదానికి గురైంది.

## మేడారంలో సమగ్ర వైద్య సేవలు



**అక్షరటుడే, హైదరాబాద్ :** మేడారం జాతర సందర్భంగా భక్తులకు సమగ్ర వైద్య సేవలు అందిస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. మేడారంలో 50 పడకల ప్రధాన ఆసుపత్రితో సహా 3 ఆస్పత్రులు అందుబాటులో ఉన్నాయన్నారు. జాతర ప్రాంతంలో, చుట్టుపక్కల 30 వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.



## రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు సాధించాలి

**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పెట్టుబడులను సాధించడమే ధ్యేయంగా కృషి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. దావోస్‌లో జరగనున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరంపై ఆయన శనివారం సమీక్షించారు. దావోస్ సదస్సులో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను, దానికి అనుగుణంగా రూపొందించిన క్యూర్, ప్యూర్, రేర్ ప్రణాళికలను ప్రపంచానికి పరిచయం చేయాలని సూచిం చారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండేళ్లలో దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా రాష్ట్రానికి లభించిన పెట్టుబడి హామీలు, ప్రతిపాదనల పురోగతితో పాటు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025లో ఆకర్షించిన పెట్టుబడులపై ఆయన ఆరా తీశారు.

## ఆల్మాంట్ కిడ్ సిరప్‌పై నిషేధం

**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ఆల్మాంట్ కిడ్ సిరప్‌పై నిషేధం విధించింది. ఈ మేరకు ఔషధ నియంత్రణ పరిపాలన డెరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసిం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆల్మాంట్ కిడ్ సిరప్ వినియోగించడం ఆపాలని ప్రభుత్వం పేర్కొంది. అందులో ఇథిలీన్ గ్లైకాల్ కల్తీ అయినట్లు గుర్తించింది. ఈ సిరప్ అత్యంత విషపూరితమైన పదార్థం అయిన ఇథిలీన్ గ్లైకాల్తో కల్తీ చేయబడిందని ప్రభుత్వం పేర్కొంది.

## చైనా మాంజాతో పలువురికి గాయాలు

**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** హైదరాబాద్ నగరంలో చైనా మాంజాతో పలువురు గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదకరమైన చైనా మాంజా విక్రయాలపై నగర పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. అయినా కొందరు దొంగచాటుగా విక్రయాలు చేపడుతున్నారు. దీంతో చైనా మాంజా రోడ్లపై, విద్యుత్ స్తంభాలకు చిక్కుకోవడంతో ప్రజలు గాయపడుతు న్నారు. తాజాగా హైదరాబాద్ నగరంలో ఇద్దరు గాయపడ్డారు.



# సంక్రాంతికి సొంతూళ్లకు..

సంక్రాంతి పండుగకు ప్రజలు పల్లెబాట పట్టారు. మూడు రోజుల పాటు ఘనంగా సాగే వేడుకల కోసం పట్టణాలు, నగరాల్లో నివాసం ఉంటున్న వారు సొంతూళ్లకు పయనం అవుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి వేడుకలు అంగరంగ వైభవంగా సాగుతాయి. దీంతో హైదరాబాద్‌లోని ఏపీ వాసులు తమ ప్రాంతానికి బయలు దేరుతున్నారు. దీంతో నగరంలోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. మరోవైపు ఆంధ్రవైపు వెళ్లే రహదారుల్లో వాహనాల రద్దీ నెలకొంది.
-అక్షరటుడే, హైదరాబాద్

- పల్లెబాట పట్టిన పట్నంవాసులు
- హైదరాబాద్‌లో కిటకిటలాడుతున్న బస్టాండ్లు
- విజయవాడ హైవేపై వాహనాల రద్దీ
- పంతంగి టోల్ ప్లాజా వద్ద భారీగా ట్రాఫిక్ జాం

తెలంగాణలో సంక్రాతి సెలవులు శనివారం నుంచి ప్రారంభం అయ్యాయి. దీంతో శుక్రవారం సాయంత్రం నుంచే ప్రజలు ఊళ్లకు వెళ్లడం ప్రారంభించారు. శనివారం ఉదయం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు బయలు దేరారు. దీంతో హైవేలపై వాహనాల రద్దీ నెలకొంది. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై శనివారం ఉదయం భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. హైదరాబాద్ నుంచి చౌటుప్పల్ దాటడానికే 2-3 గంటల సమయం పడుతోంది.

### పంతంగి టోల్‌ప్లాజా వద్ద..

చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ కొనసాగుతోంది. కిలోమీటర్ల మేర బారులు తీరి వాహనాలు మెల్లిగా కదులుతున్నాయి. సెలవులు ప్రారంభం కావడంతో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. జాతీయ రహదారిపై అండర్‌పాస్ వంతెన, సర్వీసు రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. దీంతో అక్కడ వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు సూచించారు. కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్ గేట్ వద్ద సైతం వాహనాల రద్దీ నెలకొంది. టోల్ గేటు దాటడానికి గంట నుంచి రెండు గంటల సమయం పడుతోంది.

### కిటకిటలాడుతున్న బస్టాండ్లు

హైదరాబాద్ నగరంలోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతికి ఊళ్లకు వెళ్లే వారితో రద్దీగా మారాయి. ఎంజీబీఎస్, జేబీఎస్‌లో ప్రయాణికుల సందడి నెలకొంది. ఆర్టీసీ అధికారులు రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఏపీతో పాటు తెలంగాణలోని జిల్లాలకు స్పెషల్ బస్సులు వేశారు. సంక్రాంతి సందర్భంగా ఆర్టీసీ అధికారులు 6,431 ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. వీటిలో 50శాతం అదనపు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్‌లు సైతం ప్రయాణికులతో నిండిపోయాయి. రద్దీ అధికంగా ఉండటంతో ప్రైవేట్ ట్రావెల్స్ ఆపరేటర్లు భారీగా ఛార్జీలు పెంచారు.

## ఆ రోజే రాజకీయాలు వదిలేసి ఉంటే బాగుండేది : మంత్రి కోమటిరెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్ :** మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఓ టీవీ ఛానెల్‌లో మహిళా ఐఏఎస్‌పై వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. నల్గొండ జిల్లాలోని ఓ మహిళా అధికారితో మంత్రి ప్రేమాయణం అంటూ ఇటీవల ఓ ఛానెల్ కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై మంత్రి కోమటిరెడ్డి తాజాగా స్పందించారు. మహిళా అధికారులపై రాస్తున్న వార్తల్ని ఆయన ఖండించారు. తనకు ఉన్న ఒక్కగానొక కుమారుడిని కోల్పోయి ఫౌండేషన్ పేరుతో ప్రజాసేవ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అప్పుడే రాజకీయాలు వదిలేస్తే బాగుండేదన్నారు. తప్పుడు రాతల వల్ల ఇప్పుడు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను మంత్రి అయ్యాక నల్గొండలో నలుగురు కలెక్టర్లు మారారని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. కలెక్టర్లను మార్చే అధికారం సీఎం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఉంటుందన్నారు. తాను సినీ ఇండస్ట్రీ గురించి పట్టించుకోవడం లేదని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. పుష్ప 2 సినిమా తర్వాత టికెటు రేట్లు పెంచాలని తన వద్దకు రావొద్దని చెప్పానన్నారు. దీంతో తనను ఎవ్వరూ కలవడం లేదని స్పష్టం చేశారు. రాజాసాబ్, మన శంకర వరప్రసాద్ గారు మూవీ టికెటు రేట్ల పెంపునకు తనకు సంబంధం లేదన్నారు.

## ఇరుసుమండలో అదుపులోకి వచ్చిన మంటలు



**అక్షరటుడే, ఏపీ :** అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండలో మంటలు ఆగిపోయాయి. ఓఎన్‌జీసీ గ్యాస్ బ్లో అవుట్‌తో ఆరు రోజులుగా మంటలు ఎగిసిపడ్డ విషయం తెలిసిందే.ఓఎన్‌జీసీ సిబ్బంది మంటలను అదుపు చేయడానికి తీవ్రంగా శ్రమించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం మంటలు పూర్తిగా ఆగిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది, ఓఎన్జీసీ అధికారులు వెల్ క్యాపింగ్ చేశారు. దీంతో మంటలు అదుపులోకి వచ్చాయి.

## రిపబ్లిక్ డే సేల్‌కు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ రెడీ..




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** రిపబ్లిక్ డే సేల్‌కు ఈ-కామర్స్ ప్లాట్ ఫాంలు సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగా అమెజాన్ రిపబ్లిక్ డే సేల్‌ను జనవరి 16న ప్రారంభించనుంది. అయితే ఎన్ని రోజులు సేల్ ఉంటుందన్న విషయమై స్పష్టత ఇవ్వలేదు. బ్యాంక్ ఆఫర్‌లు, నోకాస్ట్ ఈఎంఐ, లిమిటెడ్ పిరియడ్ డీల్స్ ఉండనున్నాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్రెడిట్ కార్డులను ఉపయోగించి చేసే కొనుగోళ్లకు 10 శాతం వరకు తక్షణ తగ్గింపు లభించనుంది. అలాగే ఫిప్‌కార్ట్‌లో జనవరి 17 నుంచి సేల్ ప్రారంభం కానుంది. ఫ్లిప్‌కార్ట్ ప్లస్, బ్లాక్ మెంబర్లకు 24 గంటల ముందే సేల్ అందుబాటులో ఉండనుంది. రిపబ్లిక్ డే సేల్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డులతో కొనుగోళ్లపై 10 శాతం డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు ప్రకటించింది.

## అంబర్‌పేట్ ఎస్సై భానుప్రకాశ్‌రెడ్డి అరెస్ట్



**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేట్ ఎస్సై భానుప్రకాశ్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయన రివాల్వర్ తాకట్టు పెట్టాడనే ఆరోపణలపై అదుపులోకి తీసుకున్నారు. అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో భాను ప్రకాశ్ ఎస్సైగా పని చేసేవాడు. ఆయన బెట్టింగ్‌ల బారిన పడి అప్పుల పాలయ్యాడు. అనంతరం ఆ అప్పులు తీర్చేందుకు అడ్డదారులు తొక్కాడు. ఓ కేసులో రికవరీ చేసిన ఐదు తులాల బంగారాన్ని సొంతానికి వాడుకున్నాడు. అంతేగాకుండా సదరు ఎస్సై గన్ కూడా కనిపించకుండా పోయింది. దీనిపై ఆరా తీయగా.. గన్‌ను తాకట్టు పెట్టినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో ఆయనపై గతంలో కేసు నమోదు చేసిన ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. తాజాగా ఎస్సైని అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## 'టాక్సిక్' టీజర్‌తో హాట్ టాపిక్‌గా మారిన నటి..



**కన్నడ స్టార్ యశ్ హీరోగా, గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'టాక్సిక్' ఇప్పటికే భారీ అంచనాలను క్రియేట్ చేస్తోంది. యశ్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన హీరో ఇంట్రడక్షన్ వీడియో సినిమాపై హైప్‌ను మరింత పెంచింది. ఈ వీడియోలో యశ్ 'రాయ' అనే పాత్రలో కనిపించగా, ఒక కారు సన్నివేశంలో ఆయనతో పాటు కనిపించిన ఓ విదేశీ నటి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఆ సీన్‌లో యశ్‌తో స్క్రీన్ షేర్ చేసిన ఆ అమ్మాయి ఎవరు? ఆమె బ్యాక్‌గ్రౌండ్ ఏంటి? అనే ప్రశ్నలు నెటిజన్లలో ఆసక్తిని రేపాయి. ఆ విదేశీ నటి పేరు నటాలీ బర్న్. ఉక్రెయిన్–అమెరికన్ నటి అయిన ఆమె 2006 నుంచే హాలీవుడ్‌లో నటిగా కొనసాగుతోంది.**

-అక్షరటుడే, సినిమాడెస్క్

## ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో ప్రాజెక్ట్ మేనేజర్ పోస్టులు..

**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్‌లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ప్రాజెక్ట్ మేనేజర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హత గలవారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మొత్తం 4 పోస్టులు భర్తీ చేయనుండగా.. ప్రాజెక్ట్ మేనేజర్ 1, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ 2, థిమాటిక్ ఎక్స్‌పర్ట్ 1 ఉన్నాయి. బీటెక్/బీఈ, ఎంటెక్/ఎంసీఏ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయసువారు అర్హులు. వేతనం : నెలకు రూ. లక్ష నుంచి రూ. 1.50 లక్షల వరకు ఉటుంది. జనవరి 22లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు https://career.nirdpr.in/ వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు.

